# కథాకేళి



## క్రయిం రిపోర్టర్

# మల్లాది వెంకటకృష్ణమూర్తి

క్రయిం రిపోర్టర్ వుద్యోగం గురించి అందులో చేరక మునుపు తెలీదు క్రిస్టఫర్‌కి. డిగ్రీ అయాక ఖాళీగా వుండడం ఎందుకని విశాఖపట్నంలోని ఓ దినపత్రికలో చేర్పించాడు క్రిస్టఫర్ బాబాయ్. ఇంటర్వ్యూలో తెలుగు చేతి వ్రాత చూశారు. 'విశాఖపట్నం ప్రాముఖ్యత' అన్న అంశం మీద స్వంతంగా ఓ అరఠావు మేటర్ రాయమన్నారు. వాళ్ళకి ఫర్వాలేదనిపించగానే క్రయిం రిపోర్టర్ వుద్యోగం ఇచ్చారు.

రోజూ దినపత్రికల్లో వివిధ నేరాల గురించి, నేరస్థుల గురించి చదువుకున్న క్రిస్టఫర్‌కి ఆ వుద్యోగంలో చేరాక అర్థం అయింది దిన పత్రికలు ఆ వార్తలు ఎలా సేకరిస్తాయో—

క్రిస్టఫర్ డ్యూటీ రోజూ విశాఖపట్నంలోని మేజిస్ట్రేట్ కోర్టు కెళ్ళి అక్కడికి వచ్చే క్రిమినల్ కేసుల గురించిన వివరాలు, ఏవైనా ముఖ్యమైన కేసుల్లో మేజిస్ట్రేట్‌లు ఇచ్చే తీర్పు వివరాలు మొదలయినవి రాసి దినపత్రిక ఎడిటర్‌కి అందించడం.

ఉదయం నించి సాయంత్రం దాకా క్రిమినల్ కోర్టుల్లో, సాయంత్రం నుంచి రాత్రి దాకా పోలీసు స్టేషన్లలో. పోలీసు స్టేషన్లో నమోదయే కేసుల్లోని కేసుల వివరాలు కూడా క్రిస్టఫర్ రాసి పంపించాల్సి వుంటుంది. తాగి స్కూటర్ నడుపుతుంటే జరిగే ఏక్సిడెంట్స్ నించి, రోడ్ ఏక్సిడెంట్లలో మరణించిన వారి వివరాలు, హత్యలు, ఆత్మహత్యలు, దోపిడీలు, పెద్ద, చిల్లర దొంగతనాలు, బలాత్కారాలు, మోసం చేసి డబ్బు కాజేయడం లాంటి ఎన్నో నేరాలు వంటి పెద్ద, చిన్న నేరాల వివరాలన్నీ రాసుకుని ఎడిటర్‌కి అందజేయాలి క్రిస్టఫర్.

విశాఖలో నేరం జరగని రోజంటూ వుండదని గ్రహించాడు క్రిస్టఫర్ వుద్యోగంలో చేరిన రెండు రోజుల్లోనే. ప్రతీ రోజు ఏదో ఓ నేరం జరుగుతూనే వుంటుంది. క్రమక్రమంగా అతనికి పత్రికల భాష ఎలా వుంటుందో పట్టుబడసాగింది. ఏ రకం నేరాలు ఓ మూల క్రయిం కార్నర్‌లో వేస్తారో, ఏవి మొదటి పేజీలో వేస్తారో గ్రహించ గలుగుతున్నాడు. ఓ రోజు ఏదయినా వ్యక్తిగత పని మీద పోలీసు స్టేషన్‌కు, క్రిమినల్ కోర్టుకు వెళ్ళలేకపోయినా, మిగతా దిన పత్రికల క్రయిం రిపోర్టర్స్ నించి వార్తలని తీసుకోవడం, వాళ్ళకి అలాంటి పనులున్నప్పుడు తను వారికి సహాయం చేయడం లాంటి అలవాట్లన్నీ క్రిస్టఫర్‌కి వృత్తిపరంగా అబ్బాయి.

అరుదుగా ఎప్పుడైనా క్రయిం కార్నర్‌కి సరిపడే వార్తలు సేకరించ లేనప్పుడు ఎడిటర్ విసుక్కునే వాడు.

"వాట్ మిస్టర్ క్రిస్టఫర్. మీరు కష్టపడి పనిచేయాలి. ఇలా ఏవీ లేవంటే ఎలా?" అంటారాయన మొహం ముటముటలాడిస్తూ.

"విశాఖ ప్రశాంతంగా వుంటే నన్నేం చేయమంటారు? కావాలంటే రేపు ఇతర దిన పత్రికలు చూడండి, నేను మిస్ అయిన వేమయినా వస్తాయేమో" సమాధానం ఇస్తాడు క్రిస్టఫర్.

"ఇంకెప్పుడూ ఆ మాటనకు. న్యూస్ కోసం నేను ఇంకో దిన పత్రిక చదవాలా? దిన పత్రికలో క్రయిం వార్తలు చదవడానికే కొందరు కొంటూ టారు. వాళ్లని సేటిస్‌ఫై చేయాలిగా."

సరిగ్గా ఆ ఆదివారం అలాంటి రోజే అయింది. ఆదివారం కాబట్టి క్రిమినల్ కోర్ట్‌కి సెలవు. క్రిస్టఫర్ పోలీసు స్టేషన్లని వార్తల కోసం ఆశ్రయించక తప్పలేదు. గాజువాక, డాబాగార్డెన్స్, షిప్‌యార్డ్... ఎక్కడికి ఫోన్ చేసినా. ఎలాంటి వార్తలు లేవు.

క్రిస్టఫర్ సాయంత్రం నాలుగింటికి డాబాగార్డెన్స్‌లోని పోలీసు స్టేషన్‌కి వెళ్ళాడు. అలవాటుగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని విష్ చేశాడు. ఆ సి.ఐ.కి కాస్తో గొప్పో సాహిత్యాభిలాష వుంది కాబట్టి క్రయిం రిపోర్టర్లని గౌరవంగా చూస్తాడు.

"ఏం క్రిస్టఫర్‌గారు. ఇవాళంతా ఏడారే" నవ్వాడు.

"న్యూస్ లేకపోతే మా ఎడిటర్ నన్ను చంపుతాడు, అదేదో నా తప్పయినట్టు. ఒక్క సైకిల్ దొంగతనం కేసు కూడా లేదా?" అడిగాడు క్రిస్టఫర్.

"ఊహు. మేయర్‌గారి కుక్కని దొంగతనం చేయండి. మంచి న్యూస్ ఐటం అవుతుంది. మాకూ కాస్త పనుంటుంది" నవ్వాడు సబ్ ఇన్‌స్పెక్టర్.

"ఇవాళ ఏదో ఒక న్యూస్ పట్టుకుని కాని ఇక్కడ నించి కదలను" చెప్పాడు క్రిస్టఫర్.

క్రిస్టఫర్‌కి, మరో పత్రిక నించి వచ్చిన ఇంకో రిపోర్టర్‌కి టీలు తెప్పించి ఇచ్చాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్. ఓ క్రిమినల్ లాయర్ వచ్చి ఓ గంట సేపు పిచ్చాపాటి మాట్లాడి వెళ్ళాడు. తరువాత ఎం.ఎల్.ఏ. వచ్చి అరగంట కూర్చుని వెళ్ళాడు.

గడియారం ముళ్ళు కదులుతున్నాయి. క్రిస్టఫర్‌కి, అతని మిత్రుడికి ఎంతో బోర్‌గా వుంది. రాత్రి పది దాటింది.

"సైకిల్ బెల్లు పోయిన న్యూస్ ఐటం కూడా లేదివాళ. మా ఎడిటర్ ఇంతెత్తున లేస్తాడు" చెప్పాడు క్రిస్టఫర్.

"క్రిమినల్స్ అంతా సెలవుకి వెళ్ళినట్లున్నారు" చెప్పాడు అతడి మిత్రుడు నవ్వి.

"డామిట్. ఒక్కటంటే ఒక్క నేరం జరిగినా బావుణ్ను..." పదకొండుం పావుకి చెప్పాడు క్రిస్టఫర్.

పదకొండూ ఇరవైకి వచ్చిందో ఫోను. ఫోన్‌లో అది విని తలవూపి చెప్పాడు సబ్ ఇన్‌స్పెక్టర్.

"అలాగే. వెంటనే వస్తున్నాం."

ఫోన్ పెట్టేసి ఆ ఇద్దరి వంకా చూసి చెప్పాడు. "క్రిస్టఫర్! దేముడు నీ మొరాలకించాడు. నలుగురు బందిపోట్లు పదమూడు బై నాలుగు నెంబర్ ఇంట్లోని సుశీలని రేప్ చేసి, ఆ ఇంటిని దోచుకు వెళ్ళారుట!"

"అయ్యో! అది నా ఇల్లు. సుశీల నా భార్య!" వెంటనే అరిచాడు క్రిస్టఫర్ బాధగా.

